ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 24-03-2026 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. సింగరేణి సంస్థ భవిష్యత్తును కాపాడేందుకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, మార్కెట్ ధరలకు అనుగుణంగా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు

2. గ్రేటర్ హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

3. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 9 లక్షలకు పైగా సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు.

4. రాష్ట్రంలో వంట గ్యాస్ కోరత విషయంలో వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించి, గ్యాస్ సరఫరాను పెంచేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**సింగరేణి-భట్టి విక్రమార్క**

సింగరేణి సంస్థ భవిష్యత్తును కాపాడేందుకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, మార్కెట్ ధరలకు అనుగుణంగా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2014 నుంచి 2023 వరకు ఐదేళ్ల కాలంలో రికార్డు స్థాయిలో 13 వేల 119 మందికి మెడికల్ ఇన్ వాలిడేషన్ జరిగిందని, ఇది సంస్థపై భారీ ఆర్థిక

భారాన్ని మోపిందని పేర్కొన్నారు. గత పద్నాలుగేళ్లలో ఈ సంఖ్య కేవలం 3 వేల 859 మాత్రమే ఉండగా, ఇటీవలి కాలంలో అసాధారణంగా పెరగడంపై ఏసీబీ, విజిలెన్స్ విచారణ జరిపిస్తున్నట్లు శాసన మండలిలో పలువురు సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. 2024లో 1 వెయ్యి 41 మందికి, 2025లో 949 మందికి మెడికల్ ఇన్ వాలిడేషన్ కింద వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని భట్టి విక్రమార్క వెల్లడించారు.

(డెస్క్)

**గ్రేటర్ హైదరాబాద్-శ్రీధర్ బాబు**

గ్రేటర్ హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అంశాలపై సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం మొదలుపెట్టిన పనులను ఎక్కడా నిలిపివేయలేదని, నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు లింక్ రోడ్లు, ఇతర కీలక ప్రాజెక్టుల కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని స్పష్టం చేశారు.

సౌండ్ బైట్ ... శ్రీధర్ బాబు

అంతకుముందు, హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మాధవరం కృష్ణారావు, వివేకానంద్ విమర్శించారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు జంటనగరాల ప్రగతిలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

(డెస్క్)

**సాదాబైనామా-పొంగులేటి**

రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న 9 లక్షలకు పైగా సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వం తెచ్చిన ROR చట్టంలోని లోపాల వల్ల ఈ సమస్య జటిలమైందని, దీనిని అధిగమించేందుకు జీవో 76 విడుదల చేశామని శాసన మండలిలో వెల్లడించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఆధార్ తరహాలో ప్రతి సర్వే నెంబర్‌కు 'భూధార్' కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. త్వరలోనే హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో, ఒక్కో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి దశలవారీగా భూ సర్వే నిర్వహిస్తామన్నారు.

(డెస్క్)

**సిరిసిల్ల-కిసాస్ సమ్మాస్ నిధి- బైట్**

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిధులు,  ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడంతో పాటు వ్యవసాయ అవసరాలకు చాలాఉపయోగపడుతున్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన లబ్ధిదారు మామిండ్ల లక్ష్మీరాజం ఆకాశవాణితో చెప్పారు.

సౌండ్ బైట్ ... మామిండ్ల లక్ష్మీరాజం

పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**ఈవీ-పొన్నం ప్రభాకర్**

రాష్ట్రంలో 2024 సెప్టెంబర్ నుంచి వాహన స్క్రాపేజీ పాలసీని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రవాణా శాఖలో అనేక సంస్కరణలు ప్రవేశ పెడుతున్నామని, పర్యావరణ పరిరక్షణ కోసం విద్యుత్ వాహన విధానాన్ని బలోపేతం చేస్తున్నామని శాసన మండలిలో తెలిపారు. ఈ

పాలసీలో భాగంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు 15 నుంచి 20 శాతం వరకు రాయితీ ఇచ్చేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయని పేర్కొన్నారు. నేటి నుంచే ఈ ప్రత్యేక రాయితీలు అమలులోకి వస్తాయని వివరించారు.

(డెస్క్)

**కేటీఆర్-గ్యాస్**

రాష్ట్రంలో నెలకొన్న వంట గ్యాస్ కొరతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు  తక్షణమే వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించి, గ్యాస్ సరఫరాను పెంచేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కొరత లేదని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో ప్రజలు గోడౌన్ల వద్ద గంటల తరబడి క్యూ కడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి గన్ పార్క్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఒకవైపు గ్యాస్ కొరత లేదని చెబుతూనే, మరోవైపు హోటళ్లు, చిరు వ్యాపారులకు సరఫరా నిలిపివేయడం వల్ల లక్షలాది మంది ఉపాధి దెబ్బతింటోందని తారక రామారావు అన్నారు.

(డెస్క్)

**మంచిర్యాల-గంజాయి**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈరోజు ఉదయం ఆయన ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

పీటీసీ, మంచిర్యాల

**భద్రాచలం- సీఎం టూర్ రివ్యూ**

ఈనెల 27న శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి పర్యటనపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి భూమి పూజ నిర్వహించి, అనంతరం మిథిలా స్టేడియంలో జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవానికి హాజరవుతారని, ఇందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు.

పీటీసీ, కొత్తగూడెం

**నిర్మల్-లోక్ అదాలత్**

ఈనెల 28న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల కోరారు.

పీటీసీ, నిర్మల్

**జనగామ-రైతు భరోసా**

జనగామ జిల్లాలో యాసంగి సీజన్ రైతుభరోసా తొలి దశ నిధుల జమ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. మొత్తం 12 మండలాల్లోని 1.79 లక్షల మంది రైతులకు 91.99 కోట్ల నగదును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

పీటీసీ, జనగామ

**కొత్తగూడెం-రైతు భరోసా**

రైతు భరోసా పథకంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1 లక్షా 77 వేల 201 మంది రైతులకు సుమారు 98.75 కోట్ల రూపాయల నిధులను వారి ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు తెలిపారు.

PTC-B. KGM

**నల్లగొండ-ప్రజా పాలన**

'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణను ప్రతి అధికారి సీరియస్‌గా తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు

పీటీసీ, నల్లగొండ

**సూర్యాపేట-తహశీల్దార్ సస్పెండ్**

కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా అక్రమంగా పౌతి (సక్సెషన్) చేసిన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్ నాయక్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సస్పెండ్ చేశారు. ఉమ్మడి ఆస్తిగా ఉన్న పొలాన్ని అధికారులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ఏకపక్షంగా పౌతి చేశారంటూ బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టిన కలెక్టర్, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు నిర్ధారణ కావడంతో శ్రీధర్ నాయక్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పీటీసీ, సూర్యాపేట

**ఆసిఫాబాద్ – పెన్షనర్లు**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలిడేషన్ చట్టం 2025 ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆసిఫాబాద్ జిల్లాలోని పెన్షనర్లు రేపు బ్లాక్ డే పాటించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలుపడంతో, బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పిటిసి, ఆసిఫాబాద్

**శిక్షణా కార్యక్రమం**

ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాద్ లో పార్ట్ టైమ్ కరస్పాండెంట్స్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్స్, న్యూస్ రీడర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కవాడిగూడలోని CGO టవర్స్ కాన్ఫరెన్స్ హాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి.. ఆకాశవాణి న్యూస్ సర్వీస్ డివిజన్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జీఎస్